


# రండి

ప్రభువు నందు ప్రియమైన వారలారా యేసు క్రీస్తు నామములో శుభములు. ఈ అంశమునకు ముందు "రమ్ము" అనే అంశాన్ని ధ్యానించాం. రమ్ము అని పిలిచినప్పుడు అది ఒక వ్యక్తిని ఉద్దేశించి సంబోధించేమాట. అయితే ఈ అంశము "రండి" అనగా అనేకులకు లేదా అందరిని ఉద్దేశించి పిలిచే ఒక పిలుపు. సృష్టికర్తయైన దేవుడు దారి తొలగిపోయిన మానవాళిని అంతటిని తిరిగి తన యొద్దకు పిలుచుచున్నాడు. గనుక వాక్యములో నుండి "రండి" అనే అంశాన్ని ధ్యానము చేద్దాం. మొదటగా మనుష్యులు రండి అని దేని కొరకు పిలుచుకుంటున్నారు.

**ఎక్కడికి రండి అని పిలుచుకుంటున్నారు?**

- **దేవుని నివాస స్థలమునకు వెళ్లుటకు:- కీర్త 132:7** ఆయన నివాస స్థలమునకు పోదము రండి ఆయన పాదపీఠము ఎదుట సాగిలపడుదము రండి.
- **దేవుని యొద్దకు:- యాకో 4:8** దేవుని యొద్దకు రండి, అప్పుడాయన మీ యొద్దకు వచ్చును. పాపులారా, మీ చేతులను శుభ్రము చేసికొనుడి; ద్విమనస్కులారా, మీ హృదయములను పరిశుద్ధ పరచుకొనుడి.

**ఎందుకు రండి అని పిలుచుచున్నారు?**

1. **ఉత్సాహ ధ్వని (గానము) చేయుటకు:- కీర్త 95:1** రండి యెహోవాను గూర్చి ఉత్సాహ ధ్వని చేయుదము. మన రక్షణ దుర్గమును బట్టి సంతోషగానము చేయుదము.
**కీర్త 100:2** సంతోషముతో యెహోవాను సేవించుడి. ఉత్సాహగానము చేయుచు ఆయన సన్నిధికి రండి.
2. **నమస్కారము చేసి సాగిలపడుటకు:- కీర్త 95:7** రండి నమస్కారము చేసి సాగిలపడుదము. మనలను సృజించిన యెహోవా సన్నిధిని మోకరించుదుము. నేడు మీరు ఆయన మాట నంగీకరించిన యెడల ఎంత మేలు.
3. **నైవేద్యము అర్పించుటకు:- కీర్త 96:8** యెహోవా నామమునకు తగిన మహిమ ఆయనకు చెల్లించుడి. నైవేద్యము తీసికొని ఆయన ఆవరణములోనికి రండి.
4. **యెహోవా వెలుగులో నడుచుకొనుటకు:- యెష 2:5** యాకోబు వంశస్థులారా, రండి మనము యెహోవా వెలుగులో నడుచుకొందము.

5. **దేవుని ఆశ్చర్యకార్యములు చూచుటకు:- కీర్త 66:5** దేవుని ఆశ్చర్యకార్యములను చూడరండి. నరుల యెడల ఆయన జరిగించు కార్యములను చూడగా ఆయన భీకరుడైయున్నాడు.

6. **యెహోవాను గూర్చిన జ్ఞానము సంపాదించుకొనుటకు:- హోషే 6:3** యెహోవాను గూర్చిన జ్ఞానము సంపాదించుకొందము రండి; యెహోవాను గూర్చిన జ్ఞానము సంపాదించుకొనుటకు ఆయనను అనుసరించుదుము రండి. ఉదయము తప్పక వచ్చు రీతిని ఆయన ఉదయించును. వర్షము వలె ఆయన మన యొద్దకు వచ్చును. భూమిని తడుపునట్టి తొలకరి వర్షము కడవరి వర్షము వలె ఆయన మన యొద్దకు వచ్చును.

7. **యుద్ధములో ఒకరికొకరు సహాయము చేసికొనుటకు:- న్యాయా 1:3** అప్పుడు యూదా వంశస్థులు తమ సహోదరులైన షిమ్యోనీయులతో మనము కనానీయులతో యుద్ధము చేయుటకు మా వంతులోనికి మాతో కూడ రండి. మేమును మీతో కూడ మీ వంతులోనికి వచ్చెదమని చెప్పగా షిమ్యోనీయులు వారితో కూడ పోయిరి.

❖ **దేవుడు మనుష్యులను రండి అని దేని కొరకు పిలుచుచున్నారో వాక్యములో గమనిద్దాం:-**

1. **వివాదము తీర్చుకొనుటకు:- యెష 1:18** యెహోవా ఈ మాట సెలవిచ్చుచున్నాడు. రండి మన వివాదము తీర్చుకుందము. మీ పాపములు రక్తమువలె ఎఱ్ఱనివైనను అవి హిమమువలె తెల్లబడును. కెంపువలె ఎఱ్ఱనివైనను అవి గొఱ్ఱెబొచ్చువలెతెల్లనివగును.
2. **ఆకలి, దప్పిక తీర్చుకొనుటకు:- యెష 55:1** దప్పిగొనివారలారా, నీళ్ల యొద్దకు రండి, రూకలు లేని వారలారా మీరు వచ్చి కొని భోజనము చేయుడి. రండి, రూకలు లేకపోయినను ఏమియు నియ్యకయే ద్రాక్షరసము పాలను కొనుడి.
3. **విశ్రాంతి పొందుటకు:- మత్త 11:28** ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి నేను మీకు విశ్రాంతి కలుగజేతును.
4. **సువార్తను ప్రకటించుటకు:- మార్కు 1:38** ఆయన ఇతర సమీప గ్రామములలోను నేను ప్రకటించునట్లు వెళ్లుదము రండి; యిందు నిమిత్తమే గదా నేను బయలుదేరి వచ్చితినని వారితో చెప్పెను.
5. **పరలోక రాజ్యమును స్వతంత్రించుకొనుటకు:- మత్త 25:34** అప్పుడు రాజు తన కుడివైపున ఉన్నవారిని చూచి నాతండ్రి చేత ఆశీర్వదింపబడిన వారలారా, రండి; లోకము పుట్టినది మొదలుకొని మీ కొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి.

ఈ లెంటులో మన దేవుడు రండి అని పిలుచుచున్నాడు. దేవునికి మనకు మధ్య ఉన్న వివాదాలు తీర్చుకొని ఆయనిచ్చే విశ్రాంతి పొంది, ఆయన సువార్తను ప్రకటించి ఆయనకు ఇష్టులుగా జీవించి దేవుడిచ్చే పరలోక రాజ్యమును స్వతంత్రించుకొనుటకు మనల్ని మనము సిద్ధపరచుకుందాం. అలా సిద్ధపరచుకొనే కాలమే లెంటు.

**పరలోకరాజ్యమును స్వతంత్రించుకొనుటకు కావలసిన కృప పరిశుద్ధాత్మ దేవుడు మనకందరికి అనుగ్రహించును గాక. ఆమేన్... ఆమేన్... ఆమేన్...**